

రహదారులకు మహర్దశ
గ్రామీణ రోడ్లకు మహర్దశ పట్టనుంది. పల్లెల్లోని పంచాయతీరాజ్, జిల్లా పరిషత్ రోడ్ల మరమ్మతు కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. 9లో▸



'ఉపాధి' తనిఖీలు
ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన వివిధ పనులను సామాజిక తనిఖీ బృందం సభ్యులు తనిఖీ చేస్తున్నారు. సిబ్బందితో కలిసి కొలతలు తీసి నమోదు చేస్తున్నారు. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
28.0 /23.0
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి

ఆసిఫాబాద్‌అర్బన్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ బోర్కడె హేమంత్ సహదేవ్‌రావ్ సూచించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయం నుంచి బస్టాండ్ మీదుగా తిరిగి కలెక్టరేట్ కార్యాలయం వరకు 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' నినాదంతో 5కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు జాబితాలో మార్పులు, సవరణలు, తొలగింపుల కోసం ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని పోలింగ్ కేంద్రాల్లో పూర్తి వసతులు కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో సురేశ్‌కుమార్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'కుమురంభీం' గేట్లు ఎత్తివేత

ఆసిఫాబాద్‌అర్బన్: ఎగువన మహారాష్ట్రలో వర్షాలు అధికంగా కురియడంతో జిల్లాలోని కుమ్రంభీం ప్రాజెక్టులోకి నీరు అధికంగా చేరుతోంది. శనివారం 5, 6 గేట్లు ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నట్లు ప్రాజెక్ట్ ఈఈ గుణవంత్‌రావ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రాజీ కేసులు ఎక్కువగా వచ్చేలా చూడాలి

ఆసిఫాబాద్‌అర్బన్: వచ్చే నెల 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌కు రాజీ కేసులు అధికసంఖ్యలో వచ్చేలా చూడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేశ్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని కోర్టు హాల్‌లో న్యాయవాదులు, పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, ప్రిలిటిగేషన్, బ్యాంక్, ఎలక్ట్రిసిటీ, భూతగాదా, వివాహ, కుటుంబ తగాదాలు, మోటార్ వెహికిల్, యాక్సిడెంట్ కేసులు, చిట్ ఫండ్, చెక్‌బౌన్స్ కేసులతో పాటు ఇతర రాజీపడే కేసులు పరిష్కరించనున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీశ్‌బాబు, సీనియర్ న్యాయవాదులు తాటిపల్లి సురేశ్, వెంకటేశ్, జగన్ మోహన్‌రావ్, ప్రభుత్వ ప్లీడర్ పంచదార దీపక్‌రావ్, న్యాయవాదులు కిశోర్, తేజ, శ్రీనివాస్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సెలవులు మంజూరు చేయాలి



సభ్యత్వ రశీదు ఇస్తున్న శ్రీనివాసరావు

రెబ్బెన(ఆసిఫాబాద్): వేసవి సెలవుల్లో పని చేసిన ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు మంజూరు చేయాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని తుంగెడ, గంగాపూర్, కేజీబీవీ, రెబ్బెన, గోలేటి ఆశ్రమ, సింగరేణి ఉన్నత పాఠశాలల్లో శనివారం పీఆర్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించి ఉపాధ్యాయులకు రశీదులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని వివిధ పాఠశాలల్లో దాదాపు 600 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆర్టీటీ నోటిఫికేషన్ ద్వారా వెంటనే భర్తీ చేయాలని కోరారు. 2022, 2023 వేసవి సెలవుల్లో పదో తరగతి పరీక్షల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు వెంటనే మంజూరు చేయాలన్నారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ పే స్కేల్ అందించాలని కోరారు. రెసిడెన్షియల్ పాఠశాలల్లో కేర్ టేకర్లను వెంటనే నియమించాలన్నారు. కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దు చేసి పాత విధానాన్ని పునరుద్ధరించాలని, జీవో 317 ద్వారా వచ్చిన ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు బదిలీపై పంపించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు వెంటనే పీఆర్సీ కమిటీని నియమించాలని, కోర్టు తీర్పు వెలువడిన వెంటనే బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. మండలాధ్యక్షుడు అనిల్‌కుమార్, ప్రధాన కార్యదర్శి బత్తుల సదానందం, రాజకమలాకర్‌రెడ్డి, రాము తదితరులు పాల్గొన్నారు.

వారసుల్ని దించారు.. వాటాలేసుకున్నారు!



వాంకిడి కలాన్ గ్రామ పరిధిలో మహ్మద్ లతీఫుద్దీన్‌కు చెందిన భూములు

- వారసత్వ భూమి పంచుకున్నారు
- వాంకిడిలో నయా భూపందేరం
- సాగుదారుల కబ్జాలో 104 ఎకరాలు
- దశాబ్దాల సమస్య.. ఆర్నెళ్లల్లో కొలిక్కి
- సాగుదారులపై 'అధికార' నేతల ఒత్తిళ్లు
- తతంగం నడిపిన స్థానిక మైనార్టీ నేత
- చివరకు ఆర్డీవో ట్రిబ్యునల్ కోర్టులో రాజీ

సాక్షి, ఆసిఫాబాద్: వాంకిడి మండలం కేంద్రంలోని ఓ భూ సమస్య పరిష్కారం కోసం ఇరువర్గాలు మూడు దశాబ్దాలుగా సివిల్ కోర్టు చుట్టూ తిరిగాయి. కానీ.. అక్కడ సమస్యకు పరిష్కారం లభించలేదు. అయితే ఇటీవల ఆర్నెళ్లల్లో ఆర్డీవో ట్రిబ్యునల్ కోర్టులో అదే సమస్య కొలిక్కి వచ్చింది. ఇది ఎలా సాధ్యం? అనుకుంటున్నారా!.. కెరమెరి మండలంలోని అధికార పార్టీకి చెందిన ఓ మైనార్టీ నేత, ఓ రియల్‌ఎస్టేట్ వ్యాపారి రంగంలోకి దిగితే జిల్లాలో సాధ్యం కానిదేదీ లేదని స్వయంగా రెవెన్యూ వర్గాలే పేర్కొంటుండడం గమనార్హం. ఆ మైనార్టీ నేతకు ఆసిఫాబాద్‌కు చెందిన ఓ బడా రియల్‌ఎస్టేట్ వ్యాపారి అండదండలు ఉండటంతో ఈ సమస్యకు మరింత సులువుగా పరిష్కారం లభించినట్లు తెలుస్తోంది.

సర్వే నంబర్లు.. విస్తీర్ణం..
ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి కలాన్ గ్రామ పరిధిలోని 31, 32, 33, 34, 35, 42, 45, 46, 47, 59, 60, 61 సర్వే నంబర్ల పరిధిలో 104 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూములన్నీ మహ్మద్ లతీఫుద్దీన్ అనే వ్యక్తి పేరిట ఉన్నాయి. ఈ భూములను కొన్ని దశాబ్దాలుగా మండల పరిధిలోని దాదాపు 40 మంది రైతులు సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారు. వారి తాతల కాలం నుంచి ఈ భూములు సాగుచేస్తున్నట్లు వారు చెబుతున్నారు. అయితే మహ్మద్ లతీఫుద్దీన్ మృతి చెందాక ఈ భూములపై హక్కు కోసం సాగుదారులు ప్రయత్నిస్తున్న నేపథ్యంలోనే లతీఫుద్దీన్ వారసులమని కొందరు కోర్టును ఆశ్రయించడంతో అప్పటి నుంచి సమస్యకు పరిష్కారం లభించలేదని సమాచారం. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కెరమెరికి చెందిన ఆ పార్టీ మైనార్టీ నేత కన్ను ఈ భూములపై పడినట్లు తెలుస్తోంది. ఆయన తన పలుకుబడితో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తమకు అనుకూలంగా ఫైల్ కదిపినట్లు సాగుదారులు ఆరోపిస్తున్నారు.

అధిక వాటా మైనార్టీ నేతకే..?
వాంకిడి మండం కేంద్రంలోని నాలుగువరుసల రహదారికి ఆనుకుని ఉన్న ఈ భూముల విలువ ఎకరాకు రూ.కోటికిపైగానే ఉంది. వాస్తవానికి మహ్మద్ లతీఫుద్దీన్ వారసులను సాగుదారులెవరూ చూడనేలేదని తెలుస్తోంది. అందువల్లే కోర్టులో వారికి వ్యతిరేకంగా సాగుదారులు పోరాటం చేసినట్లు సమాచారం. అయితే లతీఫుద్దీన్ మహ్మద్ అబ్దుల్ నయీమ్ (కుమారుడు), అహ్మద్ బేగం, జహీరాబీ (కుమార్తెలు) అధికార పార్టీకి చెందిన మైనార్టీ నేతను సంప్రదించడంతో సమస్య పరిష్కారమైతే అందులో అధిక వాటా అతడికే దక్కేలా ఒప్పందం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అతడికి దక్కే వాటా ప్రకారం ఆ భూమి విలువ రూ.25 కోట్లపైనే ఉంటుందని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి.

రంగంలోకి 'రియల్' వ్యాపారి
ఎలాగైనా ఈ భూములను దక్కించుకోవాలని ప్రణాళికలు రచించిన మైనార్టీ నేత చివరకు ఆసిఫాబాద్‌కు చెందిన బడా రియల్‌ఎస్టేట్ వ్యాపారిని రంగంలోని దించడం.. ఆ వ్యాపారి సాగుదారులకు వ్యతిరేకంగా హైకోర్టు నుంచి స్టే తేవడంతో అధికారపార్టీ నేతకు పనిసులువుగా మారినట్లు తెలుస్తోంది. అయితే ఈ పని చేసిపెట్టినందుకు ఆ రియల్‌ఎస్టేట్ వ్యాపారికి ఏకంగా రూ.20 లక్షలకు పైగా చెల్లించినట్లు సమాచారం. ఇక అదే సమయంలో అతడి దూరపు బంధువే రెవెన్యూ కార్యాలయంలో కీలక స్థానంలోకి రావడం.. వెనువెంటనే ఫైల్‌కు రెక్కలు రావడం చకచకా జరిగిపోయినట్లు రెవెన్యూ సిబ్బంది గుసగుసలాడుకోవడం వినిపిస్తోంది.

ఆర్డీవో కోర్టులో పరిష్కారం
లతీఫుద్దీన్ వారసులతో ఒప్పందం కుదరగానే మైనార్టీ నేత పావులు కదపడంతో 104 ఎకరాల భూ సమస్య చివరకు ఆర్డీవో ట్రిబ్యునల్ కోర్టుకు చేరినట్లు తెలుస్తోంది. అదే సమయంలో సాగుదారులను కెరమెరికి చెందిన అధికారపార్టీ నేతతోపాటు వాంకిడికి చెందిన స్థానిక నేతలు కూడా బెదిరింపులకు గురిచేయడమే కాకుండా.. రాజీ అయితే కొంత భూమి అప్పగిస్తామని ఆశజూపారు. చివరకు మస్నే పత్రూ, కమాన్‌కర్ గణపతి, రాజకణి నాగయ్య, చుణ్కార్ జయరాం అనే నలుగురు సాగుదారులు వారి ప్రతిపాదనకు అంగీకారం తెలిపారు. వారి ఆధీనంలోని 33.43 ఎకరాల భూమిని లతీఫుద్దీన్ వారసులకు 40 శాతం.. సాగుదారులకు 60 శాతం చొప్పున పంపకాలు చేసుకునేలా ఆర్డీవో ట్రిబ్యునల్ కోర్టు ఈ ఏడాది మే నెల 16న ఉత్తర్వులు ఇచ్చింది.

సర్వే నంబర్ల వారీగా భూ వివరాలు (ఎకరాల్లో)

సర్వే నంబర్లు	విస్తీర్ణం
31/1/1/1	1.2100
32/1/1	9.0800
33/1/1	3.0400
34/1/1	9.0900
35/1	7.2520
46	4.0900
47	13.0800
59/1	5.1700
60	1.1000
61	5.3100

నోట్: 42, 45 సర్వే నంబర్లు రెవెన్యూ రికార్డుల్లో కనిపించడం లేదు.

ఇరు వర్గాలు రాజీ పడ్డాయి
వాంకిడి కలాన్ గ్రామ పరిధిలోని భూములకు సంబంధించి సమస్య కొన్నేళ్లుగా కోర్టులో ఉంది. ఇటీవల ఆ భూమి వారసులు, సాగుదారులు రాజీ పడి.. ఆర్డీవో ట్రిబ్యునల్ కోర్టును ఆశ్రయించారు. వారికి 40–60 శాతం చొప్పున భూములు పంచుకునేలా ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటికే నలుగురు సాగుదారులు మాత్రమే పాస్‌బుక్‌ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. మిగతావారు ట్రిబ్యునల్ కోర్టుకు వెళ్తే వారికి కూడా భూములపై హక్కులు అందజేస్తాం.
– మహ్మద్ రహీమొద్దీన్, తహసీల్దార్, వాంకిడి

మహారాష్ట్ర ఎమ్మెల్యేకు నేతల స్వాగతం



ఎమ్మెల్యే దేవ్‌రావ్ మడ్‌గుజీ హూలీకి స్వాగతం పలుకుతున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: అసెంబ్లీ ఎన్నికల నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన మహారాష్ట్రకు చెందిన గడ్చిరొలి ఎమ్మెల్యే దేవ్‌రావ్ మడ్‌గుజీ హూలీకి హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్‌పోర్టులో స్థానిక నాయకులు శనివారం స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ మాట్లాడారు. ఆదివారం దేవ్‌రావ్ మడ్‌గుజీ హూలీ ఆసిఫాబాద్‌కు రానున్నారని తెలిపారు. గోలేటిలోని సింగరేణి గెస్ట్‌హౌస్‌లో ఉంటూ నియోజకవర్గంలోని 10 మండలాలల్లో ఆదివారం నుంచి వారంపాటు పర్యటిస్తారని పేర్కొన్నారు. పార్టీ స్థితిగతులను తెలుసుకుని బీజేపీ బలోపేతానికి కృషి చేస్తారని వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని మహాత్మాజ్యోతీ బాపూలే వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలు, గన్నారంలో వివిధ సబ్జెక్టులు బోధించేందుకు తాత్కాలిక పద్ధతిలో అతిథి అధ్యాపకుల (మహిళలు) నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్ వెంకటప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇంగ్లిష్, సోషల్ (అతిథి అధ్యాపకులు), కళాశాలల్లో ఇంగ్లిష్, గణితం, కెమిస్ట్రీ, జువాలజీ, ఫిజిక్స్ (అతిథి జూనియర్ లెక్చరర్లు) బోధించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తిగలవారు విద్యార్హతల ధ్రువపత్రాలతో ఆసిఫాబాద్‌లోని మహాత్మా జ్యోతీబాపూలే బాలుర కళాశాల, పాఠశాలలో ఈ నెల 28లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డెమో, ఇంటర్వ్యూలు జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతీబాపూలే (బాలుర) గురుకుల పాఠశాలలో ఈనెల 29న నిర్వహించనున్నట్లు కన్వీనర్ వెంకటప్రసాద్ తెలిపారు. పూర్తి వివరాలకు 9704711487 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రేపే 'లక్కీడ్రా'ప్

- జిల్లా వ్యాప్తంగా 967 దరఖాస్తులు
- దహెగాంలో అత్యధికంగా 86
- కన్నెపల్లి, లింగాపూర్ ఒక్కొక్కటే..
- సర్కార్‌కు రూ.19.34 కోట్ల రాబడి
- లక్కీడ్రా ద్వారా షాపుల కేటాయింపు



జిల్లా కేంద్రంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు (ఫైల్)

ఆసిఫాబాద్: మద్యం టెండర్ల దాఖలు ప్రక్రియ శుక్రవారం ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 32 దుకాణాలకు 967 దరఖాస్తులు వచ్చాయి. అత్యధికంగా దహెగాం దుకాణానికి 86 రాగా, ఆ తరువాతి స్థానంలో వాంకిడి షాపుకోసం 70 దరఖాస్తులు వచ్చాయి. లింగాపూర్, లోనవెల్లి దుకాణాలకు దరఖాస్తు చేసుకునేందుకు ఎవరూ ముందుకు రాకపోగా, చివరి క్షణాల్లో ఒక్కోదానికి ఒక్కో దరఖాస్తు మాత్రమే వచ్చింది. దరఖాస్తు ద్వారా ప్రభుత్వానికి రూ.19.34 కోట్ల ఆదాయం సమకూరింది.

ఆరువిడతల్లో ఫీజు
జిల్లాలోని మద్యం దుకాణాల లైసెన్స్ ఫీజును మూడు స్లాబులుగా విభజించారు. ఐదువేల లోపు జనాభా ఉన్న ప్రాంతాల్లో లైసెన్స్ ఫీజు రూ.50 లక్షలు, 50వేల నుంచి లక్ష జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.60 లక్షలు, లక్ష నుంచి ఐదు లక్షల జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.65 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. గతంలో ఒకరు ఒకే దుకాణానికి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండగా, తాజాగా ఒకరు ఎన్నింటికైనా దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించారు.

21న షాపుల కేటాయింపు
ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని 32 మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకున్నవారు ఈనెల 21వ తేదీన ఉదయం 9 గంటలలోపు కలెక్టరేట్‌లోని ఏ36 సమావేశం హాల్‌కు రావాలని జిల్లా ఎక్సైజ్ అధికారి నర్సింహారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. లక్కీ డ్రా ద్వారా షాపులు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

లక్కీడ్రా ద్వారా ఒకరు ఎన్ని దుకాణాలైనా పొందవచ్చు. టెండర్‌లో దుకాణం పొందిన వ్యాపారి ఆరు విడతల్లో ఫీజు చెల్లించే వెసులుబాటు కల్పించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో కలెక్టర్ హేమంత్ బోర్కడే చేతుల మీదుగా లక్కీడ్రా తీసి షాపులు కేటాయించనున్నారు.

జిల్లాలో దరఖాస్తులు ఇలా..

దుకాణం	దరఖాస్తులు	దుకాణం	దరఖాస్తులు	దుకాణం	దరఖాస్తులు
ఆసిఫాబాద్-1	20	గంగాపూర్	19	రవీంద్రనగర్	18
ఆసిఫాబాద్-2	27	తిర్యాణి	44	కౌటాల-1	23
ఆసిఫాబాద్-3	35	గోయగాం(కెరమెరి)	64	కౌటాల-2	31
ఆసిఫాబాద్-4	30	కాగజ్‌నగర్-1	16	బెజ్జూర్	59
ఆసిఫాబాద్-5	28	కాగజ్‌నగర్-2	18	ఎల్కపల్లి	12
ఆసిఫాబాద్-6	39	కాగజ్‌నగర్-3	22	దహెగాం	86
వాంకిడి-1	37	కాగజ్‌నగర్-4	32	గూడెం	57
వాంకిడి-2	70	కాగజ్‌నగర్-5	24	లోనవెల్లి	1
రెబ్బెన	9	కాగజ్‌నగర్-6	49	జైనూర్	17
గోలేటి	8	సిర్పూర్(టీ)	13	సిర్పూర్(యూ)	2
		నజ్రూల్‌నగర్	47	లింగాపూర్	1

పంటలకు జీవం

- జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షాలు
- పత్తి, కంది, సోయా పంటలకు ఊరట
- జోరుగా సాగుతున్న వరి నాట్లు
- హర్షం వ్యక్తంజేస్తున్న అన్నదాతలు



కౌటాలలో సాగవుతున్న పత్తి

కౌటాల: జిల్లా వ్యాప్తంగా రెండ్రోజులుగా కురుస్తున్న మోస్తరు వానలు పత్తి, సోయా, కంది పంటలకు జీవం పోశాయి. కొద్దిరోజులుగా వరుణుడి కోసం ఎదురుచూసిన రైతులు మురిసిపోతున్నారు. ఈసారి ఖరీఫ్ ప్రారంభంలో వరుణుడు కరుణించకపోగా సాగు పనులు ఆలస్యంగా ప్రారంభించారు. జూలైలో కురిసిన వర్షాలకు పత్తి, కంది, సోయా విత్తనాలు మొలకెత్తాయి. అనంతరం ఈ నెలలో 15రోజుల పాటు వరుణుడు ముఖం చాటేయగా జిల్లా వ్యాప్తంగా వరి నాట్లు ఆలస్యమయ్యాయి. పత్తి, కంది పంటల్లో ఎదుగుదల మందగించింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పంటలకు జీవం పోశాయి.

4.51 లక్షల ఎకరాల్లో సాగు
జిల్లాలోని 1.20 లక్షల మందికి పైగా రైతులు ఖరీఫ్‌లో 4.51ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అత్యధికంగా 3,35,178 ఎకరాల్లో పత్తి, 54,611 ఎకరాల్లో వరి, 46,096 ఎకరాల్లో కంది, 3,017 ఎకరాల్లో పెసర, 1,524 ఎకరాల్లో సోయా సాగు చేస్తున్నారు. ఖరీఫ్‌లో రుతుపవనాల రాక ఆలస్యం కావడంతో సాగు పనులు ఆలస్యంగానే ప్రారంభయ్యాయి. రెండు నెలలపాటు వర్షాలు ఆశించిన స్థాయిలో కురవడం లేదు. దీంతో వరినాట్లు ఆలస్యం కాగా, ప్రస్తుత వర్షాలతో జోరందుకున్నాయి. వర్షాల అనంతరం పత్తి, కంది, సోయా పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపడితే మొక్కలు ఏపుగా పెరుగుతాయని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం చురుగ్గా ఉండడంతో జిల్లాలో మరో రెండ్రోజుల పాటు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు.

కరుణించిన వరుణుడు
ఈ ఏడాది కోటి ఆశలతో సాగు పనులు ప్రారంభించిన రైతులకు ఆది నుంచి కష్టాలే ఎదురయ్యాయి. గతేడాది భారీ వర్షాలకు నష్టపోగా ఈసారి ఆశించిన స్థాయిలో వర్షాలు లేక అవస్థలు పడుతున్నారు. 15 రోజులుగా వరుణుడు ముఖం చాటేశాడు. పైగా ఎండల తీవ్రత పెరగడంతో పత్తి, కంది, సోయా పంటలు వాడిపోయాయి. వరి పొలాలు బీటలు బారాయి. దీంతో వ్యవసాయ బావుల నుంచి విద్యుత్ మోటర్లు, చెరువులు, వాగుల నుంచి ఆయిల్ ఇంజిన్లతో సాగునీరు అందించి రైతులు ఖర్చులపాలయ్యారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఆనందం వ్యక్తంజేస్తూ పత్తి, కంది, సోయా పంటలకు ఎరువులు వేయడానికి సిద్ధమవుతున్నారు. కాగా, డీలర్లు అధిక ధరలకు ఎరువులు, పురుగుల మందులు విక్రయించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పత్తి చేన్లలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, ఎరువులు అధికంగా వినియోగిస్తే భూసారం తగ్గుతుందని వ్యవసాయాధికారులు రైతులను అప్రమత్తం చేస్తున్నారు.

శనివారం నమోదైన వర్షపాతం (మిల్లీ మీటర్లలో)

మండలం	అసలు	సాధారణం
జైనూర్	42.6	10.1
సిర్పూర్(యూ)	49.2	10.4
లింగాపూర్	44.0	13.1
తిర్యాణి	36.1	11.4
రెబ్బెన	18.1	11.8
ఆసిఫాబాద్	19.0	10.3
కెరమెరి	34.0	10.9
వాంకిడి	19.7	13.6
కాగజ్‌నగర్	13.9	10.9
సిర్పూర్(టీ)	28.7	17.7
కౌటాల	30.9	12.0
చింతలమానెపల్లి	34.9	14.9
బెజ్జూర్	50.4	14.2
పెంచికల్‌పేట్	38.8	15.4
దహెగాం	49.6	19.0

పత్తికి జీవం పోసింది



ఖరీఫ్‌లో ఆలస్యంగానే పత్తి విత్తనాలు వేశాను. అనంతరం కురిసిన వర్షాలకు పత్తి మొలకెత్తింది. కొద్దిరోజుల పాటు వానలు కురవకపోవడంతో మొక్కలు వాడే స్థితి చేరడంతో ఆందోళన చెందాను. ప్రస్తుతం మోస్తరు వర్షాలు కురుస్తుండడంతో పత్తి మొక్కలకు ప్రాణం పోసినట్లయింది. వర్షాల అనంతరం ఎరువులు వేస్తా.
– రత్నం మల్లయ్య, గురుదుపేట

ఉద్యోగ భద్రత కల్పించాలి

- కలెక్టరేట్ ఎదుట మిషన్ భగీరథ కార్మికుల ధర్నా

ఆసిఫాబాద్: ఉద్యోగ భద్రత కల్పించాలని మిషన్ భగీరథ కార్మికులు శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్ మాట్లాడారు. ఎల్అండ్‌టీ, ఎవరెస్ట్, మెగా కంపెనీల యాజమాన్యాలు నెలల తరబడి మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. ఆయా కంపెనీలపై రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. బోనస్, ప్రయాణ ఖర్చులు, ఫోన్ బిల్స్ ఇతర అవసరాలకు నెలకు రూ.5వేలు, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, బీమా రూ.60 లక్షలకు పెంచాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ హేమంత్ బోర్కడేకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఓదెలు, రాజేందర్, బుడ్డయ్య, ఈశ్వర్, లింగయ్య, శంకర్, పాండు పాల్గొన్నారు.

రెండో ఏఎన్‌ఎంలపై నిర్లక్ష్యం తగదు



జోరువానలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రెండో ఏఎన్ఎంలు

ఆసిఫాబాద్‌అర్బన్: 20 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో విధులు నిర్వర్తిస్తున్న రెండో ఏఎన్ఎంలపై నిర్లక్ష్యం తగదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి రెండో ఏఎన్ఎంలు చేపట్టిన సమ్మె నాలుగో రోజుకు చేరింది. శనివారం కలెక్టరేట్ ఎదుట జోరు వానలోనూ ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.. రెండో ఏఎన్ఎంలను ఎలాంటి షరతులు లేకుండా రెగ్యులరైజ్ చేయాలని, ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద బీమా కింద రూ.50 లక్షలు, దురదృష్టవశాత్తు మరణించిన రెండో ఏఎన్ఎం కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. ఇచ్చిన హామీ మేరకు సీఎం కేసీఆర్ రెగ్యులరైజ్ చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకురాళ్లు వసంత, సంతోషి, పుణ్యవతి, భాగ్య, భూదేవి, ప్రమీల, సునీత, పద్మ, రాజేశ్వరి, తిరుమల మంగ, లీల, కవిత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కుక్కలదాడిలో వృద్ధురాలికి గాయాలు


గాయపడిన మల్లమ్మ

ఆసిఫాబాద్‌అర్బన్‌: మండలంలోని బురుగూడ గ్రామానికి చెందిన వృద్ధురాలు మల్లమ్మపై శనివారం వీధికుక్కలు దాడిచేయడంతో గాయాలయ్యాయి. ఉదయం ఇంటిముందు వాకిలి ఊడుస్తుండగా ఒక్కసారిగా కుక్కలగుంపు ఆమెపై దాడిచేసింది. సమీపంలో ఉన్న పలువురు కుక్కలను తరిమేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గాయాలపాలైన వృద్ధురాలిని ఆసిఫాబాద్‌ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా కుక్కకాటుకు ఇంజక్షన్లు లేవనిచెప్పడంతో మంచిర్యాలకు తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

చింతలమానెపల్లిలో బాలునికి..

చింతలమానెపల్లి: మండల కేంద్రంలో కుక్క దాడి చేసిన ఘటనలో బాలునికి గాయాలయ్యాయి. మడె శంకర్‌ అనే బాలుడు శనివారం పాఠశాలకు వెళ్తుండగా కుక్క దాడి చేయడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కౌటాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

మనస్తాపంతో ఒకరు ఆత్మహత్య


పోషయ్య (ఫైల్‌)

దండేపల్లి(మంచిర్యాల): మనస్తాపంతో పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై కుందారపు ప్రసాద్‌ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గూడెం గ్రామానికి చెందిన గొర్రె పోషయ్య (42) కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. పలు ఆస్పత్రులకు వెళ్లినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. శనివారం పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు లక్సెట్టిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.

పేకాట స్థావరంపై దాడులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: ఎస్పీ సురేష్‌కుమార్‌ ఆదేశాల మేరకు కెరమెరి మండలంలోని హట్టి గ్రామంలో శనివారం పేకాట స్థావరంపై దాడులు నిర్వహించినట్లు సీఐ రాణాప్రతాప్‌ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న 9 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.10,400 నగదు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్‌ ఎస్సై సందీప్‌కుమార్‌, కానిస్టేబుళ్లు మధు, రమేశ్‌, సంజీవ్‌ పాల్గొన్నారు.

మృతిచెందిన మేకలకు పంచనామా

కోటపల్లి(చెన్నూర్‌): మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన ఈటెల్లి ధర్మయ్యకు చెందిన 13 మేకలపై శుక్రవారం అడవి కుక్కలు దాడి చేసి హతమార్చాయి. శనివారం పశువైద్యాధికారి పవన్‌ వాటికి పంచనామా నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గడ్డం సతీష్‌, జిల్లా అధ్యక్షురాలు పుట్ట లావణ్య మాట్లాడుతూ బాధితునికి రూ.2 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌ చేశారు.

ఉపాధి లడ్డూ!



ఇతరులపై ఆధారపడకుండా తమకంటూ ఓ గుర్తింపు కోసం ఆదివాసీ మహిళలు ఒక్కటయ్యారు. ఆదివాసీ భీంబాయి సంఘం పేరుతో ఆహార కేంద్రాన్ని ఏర్పాటు చేసుకుని ఇప్పపువ్వు లడ్డూల తయారీపై దృష్టి సారించారు. ఉమ్మడి జిల్లాతో పాటు పక్కరాష్ట్రాలకు సైతం ఆర్డర్లపై లడ్డూలను సరఫరా చేస్తున్నారు. ఆదివాసీ మహిళల్లోని రక్తహీనత నివారణకు వీరు తయారుచేసిన ఇప్పపువ్వు లడ్డూ ఎంతగానో దోహదం చేస్తుందని ఐటీడీఏ అధికారుల నుంచి మెప్పు పొందారు. 12 మంది మహిళలు సభ్యులుగా సంఘం ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

– ఉట్నూర్‌రూరల్‌

ఉట్నూర్‌ ఐటీడీఏ సహకారంతో...

2019లో 12 మంది మహిళలు ఐటీడీఏ సహకారంతో ఇప్పపువ్వు లడ్డూ తయారీకి కావాల్సిన పరికరాలకు రూ.14 లక్షల యూనిట్‌తో సామగ్రిని కొనుగోలు చేసి ఆదిలాబాద్‌ జిల్లా ఉట్నూర్‌ ఎక్స్‌రోడ్డులోని ఐటీడీఏ పరిశ్రమలో ఆహార కేంద్రాన్ని ప్రారంభించారు. కరోనా సమయంలో తయారీని నిలిపివేసి ప్రస్తుతం తమ వ్యాపారాన్ని మళ్లీ ప్రారంభించారు.


లడ్డూల తయారీలో ఆదివాసీ మహిళలు

- ఇప్పపువ్వుతో తయారు చేస్తున్న ఆదివాసీలు
- 12 మంది సంఘంగా ఏర్పడిన ఆదివాసీ మహిళలు
- తయారీపై మహారాష్ట్రలో శిక్షణ..
- ఐటీడీఏ సహకారంతో యూనిట్‌ ఏర్పాటు
- ఉమ్మడి జిల్లాతో పాటు పక్కరాష్ట్రాలకు సైతం సరఫరా

సండే స్పెషల్‌

లడ్డూ తయారీ ఇలా..

పోషక విలువలతో కూడిన డ్రైఫ్రూట్స్‌తో పాటు ప్రకృతి ప్రసాదించిన ఇప్పపువ్వుతో ఈ లడ్డూలను తయారు చేస్తున్నారు. ఇప్పపువ్వును ఎండబెట్టి నూనెలో ఫ్రై చేసి ఎండబెట్టిన అనంతరం కిష్‌మిష్‌, బాదం, యాలకుల పొడి, ఇప్పపువ్వు, పల్లీలు, బెల్లం కలిపి లడ్డూలను తయారు చేస్తారు. వాటిని ఆదిలాబాద్‌ న్యాచురల్‌ దుకాణాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్‌ జిల్లాకు సైతం సరఫరా చేస్తున్నారు. ఆర్డర్లపై తయారు చేస్తూ విక్రయిస్తున్నారు. క్వింటాల్‌ లడ్డూలకు రూ.20 నుంచి 25వేల వరకు ఆదాయం వస్తుందని వారు పేర్కొంటున్నారు. వీటి తయారీ కోసం మహారాష్ట్రలోని యవత్‌మాల్‌ జిల్లాలో మూడు రోజుల పాటు శిక్షణ సైతం తీసుకున్నారు.

ఉపాధి మార్గం దొరికింది..

ఖాళీగా ఉండకుండా గ్రూపుగా ఏర్పడి లడ్డూల తయారీని ఎంచుకున్నాం. ఐటీడీఏ సహకారంతో సామగ్రిని కొనుగోలు చేసి లడ్డూ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసుకున్నాం. మేము చేస్తున్న లడ్డూలు ఎంతో పోషక విలువలతో కూడినవి. అధికారులు గుర్తించి లడ్డూలను అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులకు అందించాలి. చిన్నారులకు, రక్తహీనత ఉన్న వారికి మంచి ఫలితాలు వస్తాయి.

– బాగ్‌బాయి, ఆదివాసీ భీంబాయి సంఘం అధ్యక్షురాలు

మంచి పోషకాహారం



పోషక విలువలతో కూడిన పదార్థాలతో ఈ లడ్డూలు తయారు చేస్తున్నాం. రక్తహీనత నివారణకు ఎంతగానో దోహదపడుతాయి. మేము తయారుచేసిన లడ్డూలను ప్రతిఒక్కరూ మెచ్చుకుంటున్నారు. లడ్డూలను ఆదిలాబాద్‌, అనంతపూర్‌ నుంచి ఆర్డర్లతో పాటు ఎవరైనా ఆర్డర్‌ ఇస్తే తయారు చేసి అందిస్తున్నాం. కిలో లడ్డూలకు రూ.400 చొప్పున విక్రయిస్తున్నాం.

– మెస్రం గంగుబాయి, సంఘం సభ్యురాలు

పైలట్‌ ప్రాజెక్టుగా...

ఈ లడ్డూలను పరిశీలించిన అధికారులు పైలట్‌ ప్రాజెక్టు కింద గర్భిణులకు పంపిణీ చేయాలని ఆదిలాబాద్‌, కుమురంభీం జిల్లాలను ఎంపిక చేశారు. ఆదిలాబాద్‌లో 150 మంది, కుమురంభీం జిల్లాలో 150 మంది గర్భిణులకు ఈ లడ్డూలను కలెక్టర్‌, ఐటీడీఏ పీవో అధ్యక్షతన పంపిణీ చేశారు. ఇవి రక్తహీనత నివారణకు ఎంతో దోహదపడ్డాయని గుర్తించారు.


ఉట్నూర్‌ ఎక్స్‌రోడ్డులోని ఆదివాసీ ఆహార కేంద్రం



లడ్డూ తయారీకి సిద్ధం చేసిన ఇప్పపువ్వు, నువ్వులు, పల్లీలు


విక్రయానికి సిద్ధంగా ఇప్పపువ్వు లడ్డూలు

విద్యతోనే సర్వతో ముఖాభివృద్ధి


మాట్లాడుతున్న అడిషనల్‌ కలెక్టర్‌ మోతీలాల్‌

మంచిర్యాలఅర్బన్‌: విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని, ముఖ్యంగా మహిళా విద్య కుటుంబాన్ని, జీవన విధానాన్ని సమూలంగా మారుస్తుందని జిల్లా అడిషనల్‌ కలెక్టర్‌ మోతీలాల్‌ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఆండాళమ్మకాలనీలో కుట్టు శిక్షణ పొందిన మహిళలకు మూల్యాంకనం (పరీక్ష) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుట్లు, అల్లికలకు మంచి ఆదరణ ఉందని, నైపుణ్యం పెంచుకుంటే స్వయం ఉపాధి పొంది ఆర్థిక స్థితిని పెంచుకోవచ్చన్నారు. అక్షరాస్యతతో పాటు కుట్టు శిక్షణ అందిస్తున్న వయోజనశాఖను అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్‌, రిటైర్డు ఉపసంచాలకుడు వీరేశం, డీఆర్పీలు ప్రకాశ్‌, వెంకటేశ్వర్లు, శాంకరి, స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్దయ్య, శీశ్రీ కళావేదిక అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌ పోటీల్లో విద్యార్థుల సత్తా


క్రీడాకారులతో ప్రిన్సిపాల్‌ సంతోష్‌

బెల్లంపల్లి: పట్టణంలోని కాసిపేట గురుకులంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్‌ పోటీల్లో కళాశాల విద్యార్థులు సత్తాచాటారు. అండర్‌–14 విభాగంలో నిర్వహించిన 600 మీటర్ల పరుగు పందెం పోటీల్లో బి.అనిల్‌ బ్రాంజ్‌ మెడల్‌, అండర్‌–16 విభాగంలో జరిగిన 2 వేల మీటర్లు, 800 మీటర్ల పరుగు పందెం పోటీల్లో ఆర్‌.వివేకవర్ధన్‌ గోల్డ్‌మెడల్‌, అండర్‌–18 విభాగంలో 3వేల మీటర్ల పరుగు పందెంలో డి.సాయికిరణ్‌ గోల్డ్‌ మెడల్‌, 800 మీటర్ల పరుగు పందెం పోటీలో బ్రాంచ్‌ మెడల్‌ను కైవసం చేసుకున్నాడు. అండర్‌–20 విభాగంలో ఎస్‌.రవితేజ 800 మీటర్ల పరుగుపందెంలో గోల్డ్‌మెడల్‌, 5వేల మీటర్లలో ఎ.అరవింద్‌ సిల్వర్‌ మెడల్‌, 800 మీటర్లలో బ్రాంజ్‌ మెడల్‌ సాధించారు. ఈ నెల 20, 21 తేదీల్లో హైదరాబాద్‌లోని గోల్కొండ ఆర్మీ బాయ్స్‌ స్పోర్ట్స్‌ కంపెనీలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. ప్రిన్సిపాల్‌ సంతోష్‌కుమార్‌, వైస్‌ ప్రిన్సిపాల్‌ స్రవంతి, విద్యార్థులను అభినందించారు.

బెల్లంపల్లి కేవీకేకు జోనల్‌స్థాయి అవార్డులు



అవార్డు అందుకుంటున్న రాజేశ్వర్‌నాయక్‌

బెల్లంపల్లి: వ్యవసాయరంగాన్ని ప్రగతిపథంలో నడిపించేందుకు రైతాంగానికి ఆధునిక వ్యవసాయ పద్ధతులు పరిచయంచేసి ప్రోత్సహిస్తున్న బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రానికి నాలుగు జోనల్‌స్థాయి అవార్డులు వరించాయి. కోయంబత్తూర్‌లోని వ్యవసాయ వర్శిటీలో ఈ నెల 17 నుండి 19 వరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌, తమిళనాడు, పాండిచ్చేరి రాష్ట్రాలలోని 79 కృషి విజ్ఞాన కేంద్రాల వార్షిక జోనల్‌ సమావేశాలు నిర్వహించారు. గతేడాది బెల్లంపల్లి కేవీకే నిర్వహించిన పలు అంశాలను సమావేశాల్లో ప్రదర్శించారు. ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా నూనెగింజల సాగును ప్రోత్సహించేలా నిర్వహించిన సామూహిక క్షేత్ర ప్రదర్శనలకు, చేపల పెంపకంపై ఏర్పాటు చేసిన నమూనా క్షేత్రాలకు, వ్యవసాయ సాంకేతికతను ప్రతిబింబించేలా తీసిన ఛాయా చిత్రానికి అవార్డులు దక్కినట్లు బెల్లంపల్లి కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ ఎం.రాజేశ్వర్‌ నాయక్‌ తెలిపారు. ఈమేరకు ఆయన అవార్డులను అందుకున్నారు.

బాలిక గర్భానికి కారణమంటూ వ్యాపారి నుంచి వసూలు..?

కాసిపేట(బెల్లంపల్లి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఆదివాసీ బాలిక గర్భం దాల్చడానికి కారణమంటూ వ్యాపారి వద్ద మరో గ్రామానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి, పార్టీ నాయకులు డబ్బులు వసూలు చేశారనే విషయం చర్చనీయాంశమైంది. గ్రామంలోని వ్యాపారి ఇంట్లో బాలిక పని చేస్తోంది. తల్లిదండ్రులు లేకపోవడంతో బంధువుల వద్ద ఉంటోంది. ఈ క్రమంలో బాలిక గర్భం దాల్చిందని, వ్యాపారి కారణమని బెదిరించి అతడి నుంచి రూ.2లక్షలు వసూలు చేసినట్లు తెలిసింది. బాలికను ఆస్పత్రికి తీసుకెళ్లి పరీక్షలు చేయించి గర్భం లేదని వైద్యులతో నిర్ధారణ చేయించారు. వ్యాపారికి సంబంధం లేదంటూ సదరు ప్రజాప్రతినిధి బాండ్‌ పేపర్‌పై గ్రామస్తులతో సంతకం చేయించే ప్రయత్నం చేయగా స్థానికులు నిలదీయడంతో వెళ్లిపోయినట్లు తెలిసింది.

సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన

మంచిర్యాలఅర్బన్‌: పాత మంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా సైన్స్‌ సెంటర్‌కు చెందిన జిజ్ఞాన సంచార విజ్ఞానశాల ఆధ్వర్యంలో సైన్స్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సెంటర్‌ ఇన్‌స్ట్రక్టర్‌ సాయికుమార్‌ మాట్లాడుతూ సైన్స్‌లోని వివిధ అంశాలను ప్రత్యక్షంగా చూపడం ద్వారా విద్యార్థులకు నేర్చుకోవాలన్న ఆసక్తి పెరుగుతుందన్నారు. నేర్చుకున్నదని ఎక్కువ కాలం గుర్తుండేలా సంచార విజ్ఞానశాల ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సత్యనారాయణ, సైన్స్‌ ఉపాధ్యాయురాలు మంజుల, తదితరులు పాల్గొన్నారు.

‘బీసీలకు 34 సీట్లు ఇవ్వాలి’


గాంధీభవన్‌ వద్ద డాక్టర్‌ నీలకంఠేశ్వర్‌

మంచిర్యాలటౌన్‌: ఉదయ్‌పూర్‌ డిక్లరేషన్‌ ప్రకారం బీసీలకు 34 సీట్లు ఇవ్వాలని కాంగ్రెస్‌ నాయకుడు డాక్టర్‌ నీలకంఠేశ్వర్‌ సూచించారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శనివారం జరిగిన ఓబీసీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఎంపీ నియోజకవర్గంలో రెండు ఎమ్మెల్యే సీట్లు బీసీలకు ఇవ్వాలని ఉదయ్‌పూర్‌ డిక్లరేషన్‌ ద్వారా చెప్పడం జరిగిందని, కానీ ఎక్కువ మంది బీసీలు ఉండడంతో మూడు సీట్లు ఇవ్వాలని వక్తలు సూచించినట్లు తెలిపారు. సమావేశంలో మంచిర్యాల నియోజకవర్గం నుంచి వంగల దయానంద్‌, సత్యనారాయణ, కొట్టె లచ్చన్న, శ్రీనివాస్‌గౌడ్‌, శేఖర్‌, జ్ఞానేశ్వర్‌ పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించాలి

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌


బైక్‌ ర్యాలీలో పాల్గొన్న ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌

కాగజ్‌నగర్‌టౌన్‌: రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ ఆర్‌ఎస్‌ ప్రవీణ్‌కుమార్‌ పిలుపునిచ్చారు. బహుజన రాజ్యాధికార యాత్రలో భాగంగా శనివారం పట్టణంలో భారీ బైక్‌ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక వాసవీ గార్డెన్స్‌లో మైనార్టీ నాయకుడు షబ్బాఖాన్‌ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ పార్టీలకు చెందిన 100 మంది కార్యకర్తలు బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్‌ మాట్లాడుతూ సిర్పూర్‌ పేపర్‌ మిల్లు కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చే రూ.35 వేల బోనస్‌ వడ్డీతో సహా సెప్టెంబర్‌ 5లోగా చెల్లించాలని, లేనిపక్షంలో కార్మికులతో కలిసి సమ్మె చేస్తామని హెచ్చరించారు. కేసీఆర్‌ ప్రభుత్వ హయాంలో ప్రతీ పేద కుటుంబానికి అన్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ తాలుకా ఇన్‌చార్జి అర్షద్‌ హుస్సేన్‌, రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతి, మాజీ జెడ్పీటీసీ పిల్లల తిరుపతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జంగాల్‌పేటకు అధికారుల పరుగులు

- ‘గృహలక్ష్మి’ దరఖాస్తుల పరిశీలన పూర్తి

సాక్షి ఎఫెక్ట్‌..


దరఖాస్తులు పరిశీలిస్తున్న అధికారులు

నెన్నెల(బెల్లంపల్లి): జంగాల్‌పేటలో ‘గృహలక్ష్మి’ దరఖాస్తుల పరిశీలన ఎట్టకేలకూ పూర్తయ్యింది. ‘గృహలక్ష్మి’కి జంగాల్‌పేట దూరం’ అనే శీర్షికన శనివారం ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీవో వరలక్ష్మి, ఎంపీవో శ్రీనివాస్‌, ముగ్గురు కార్యదర్శులు, మరో ముగ్గురు టీఏలు గ్రామానికి పరుగులు పెట్టారు. ఈ నెల 20లోగా దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాల్సి ఉండగా జంగాల్‌పేటలో సర్వేనే ప్రారంభం కాకపోవడంతో దరఖాస్తుదారులు ఆందోళన చెందారు. విషయాన్ని ‘సాక్షి’ వెలుగులోకి తేవడంతో అధికారుల్లో కదలిక వచ్చింది. ఉదయాన్నే గ్రామానికి చేరుకున్న అధికారులు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించారు. గడువులోగా సర్వే జరిగేలా చూసిన ‘సాక్షి’కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

టెలిగ్రామ్‌ లింక్‌తో మోసం

- రివ్యూస్‌ పంపిస్తే డబ్బులు ఇస్తామంటూ మెసేజ్‌
- రూ.5.28 లక్షలు నష్టపోయిన మహిళ

రామకృష్ణాపూర్‌(చెన్నూర్‌): తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించవచ్చని ఆశపడిన ఓ మహిళ రూ.5.28 లక్షలు నష్టపోయింది. మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి, పట్టణ ఎస్సై అశోక్‌ తెలిపిన వివరాల ప్రకారం రామకృష్ణాపూర్‌కు చెందిన ఓ మహిళ మంచిర్యాలలో ప్రైవేట్‌ లెక్చరర్‌గా పనిచేస్తోంది. ఇటీవల ఆమెకు తన స్నేహితుల ద్వారా టెలిగ్రామ్‌లో ఓ లింక్‌ వచ్చింది. రివ్యూస్‌ పంపిస్తే డబ్బులు వస్తాయంటూ లింక్‌లో నమ్మబలికారు. తొలుత ఆమె పంపిన రివ్యూస్‌కు కొన్ని డబ్బులు కూడా వచ్చాయి. అయితే దీనిని పార్ట్‌టైం ఇన్‌కాంగా భావించిన మహిళ మరిన్ని రివ్యూస్‌లు పంపించడం ప్రారంభించింది. ఆ తర్వాత డబ్బులు పంపాలంటే కొంత డబ్బు డిపాజిట్‌ చేయాల్సి ఉంటుందని చెప్పడంతో కొంతడబ్బు బ్యాంకు ఖాతాలో డిపాజిట్‌ చేసింది. పంపిన డబ్బుకు అధికంగా డబ్బులు తిరిగి రావటంతో మరిన్ని డబ్బులు వస్తాయన్న ఆశతో వేర్వేరు అకౌంట్లకు డబ్బులు పంపించటం ఆరంభించింది. ఈ నెల 5, 6 7 తేదీలలోనే మొత్తం తొమ్మిది వేర్వేరు బ్యాంకు అకౌంట్లకు ఏకంగా రూ.5లక్షల 28 వేలు పంపించింది. తిరిగి డబ్బులు రాకపోవడంతో ఏదో మోసం జరిగిందని భావించి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. అప్పటికే డబ్బును వినియోగించుకున్న సైబర్‌ నేరగాళ్ల నుండి ఒక ఖాతాలో ఉన్న రూ.20 వేలను ఫ్రీజ్‌ చేసినట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పార్శిల్‌ సర్వీస్‌ పేరిట..

- రూ.18,480 నష్టపోయిన బాధితుడు
- పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు

మందమర్రిరూరల్‌(చెన్నూర్‌): పార్శిల్‌ సర్వీస్‌ పేరిట తనకు మోసం జరిగిందని పట్టణానికి చెందిన గజ్జనాల శ్రీనివాస్‌ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం శ్రీనివాస్‌కు గతేడాది జూన్‌ 27న మీ షో పార్శిల్‌ సర్వీస్‌ పేరుతో గుర్తు తెలియని వ్యక్తి కాల్‌చేసి మీకు తప్పుడు పార్శిల్‌ వచ్చిందని ఎస్బీఐ డెబిట్‌కార్డు వివరాలు తెలియజేస్తే రిఫండ్‌ చేస్తామని చెప్పాడు. అతని మాటలు నమ్మి వివరాలు చెప్పడంతో రూ.4,900లు కట్‌ అయ్యాయి. మోసపోయానని గ్రహించిన బాధితుడు మీ షో కస్టమర్‌ కేర్‌ సెంటర్‌కి ఫిర్యాదు చేయగా క్రెడిట్‌ కార్డు నంబర్‌ తెలియజేస్తే ఒక అప్లికేషన్‌ పంపిస్తాం దాన్ని స్కాన్‌ చేస్తే మీ డబ్బులు రిఫండ్‌ అవుతాయని చెప్పి అప్లికేషన్‌ పంపించారు. అప్లికేషన్‌ స్కాన్‌ చేయగా మళ్లీ రూ.13,580 కట్‌ అయ్యాయి. మళ్లీ మోసపోయానని గ్రహించిన శ్రీనివాస్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులకు ఎలాంటి వివరాలు చెప్పవద్దని, ఎవరైనా సైబర్‌ మోసాలకు గురైతే 1930 నంబర్‌కు కాల్‌ చేయాలని సీఐ సూచించారు.

తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి కేంద్రీకరించాలి

- జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్‌ అధికారి శ్రీనివాస్‌


మాట్లాడుతున్న సెక్టోరియల్‌ అధికారి శ్రీనివాస్‌

భీమారం(చెన్నూర్‌): తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్‌ అధికారి పి.శ్రీనివాస్‌ కోరారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో విద్యార్థులు, తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాఠశాలలో చదువుకున్న పాఠ్యాంశాలను ఇంట్లో ప్రత్యేక గదిలో ఉంచి చదివిస్తే విద్యార్థులకు మరింత ఆసక్తి పెరుగుతుందన్నారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు జిల్లా అదనపు కలెక్టర్‌తో కలిసి సహపంక్తి భోజనం ఏర్పాటు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్‌ రావు, విద్యాకమిటీ చైర్మన్‌ సత్యనారాయణ, ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దిగివచ్చిన టమాటా



మంచిర్యాలఅగ్రికల్చర్‌: టమాట డబుల్‌ సెంచరీ నుంచి హాఫ్‌ సెంచరీకి చేరింది. మొన్నటి వరకు కిలోకు రూ.200 ధర పలుకగా ప్రస్తుతం రూ.50కి చేరడంతో వినియోగదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం ఆరంభంలో వేసుకున్న పంట దిగుబడి వస్తుండడంతో వారం రోజులుగా రూ.80 నుంచి 50 వరకు ధర తగ్గుతూ వస్తోంది.